క్లుప్తంగా

అంటువ్యాధులపై అప్రమత్తత అవసరం



16వ వార్డులో మహిళలతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ జయరాం

డోన్: వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా సీజనల్ వ్యాధుల నుంచి బయట పడవచ్చని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం అన్నారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని 16వ వార్డులో డీఈ రసూల్, ఏఈ సతీష్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషాతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ప్రతి ఇంటికి వెళ్లి వ్యాధిగ్రస్తులను గుర్తించాలని తెలిపారు. ఐదేళ్ల లోపు పిల్లలకు ప్రభుత్వం అందించే జింక్, ఓఆర్ఎస్ ద్రావణాన్ని ఉచితంగా పంపిణీ చేయాలని సూచించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అందరూ సహకరించాలని కోరారు.

గ్రంథాలయ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో గ్రంథాలయ భవన నిర్మాణానికి డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశ్ రెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. రూ.10 లక్షలతో భవనం నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రజా సంక్షేమంతో పాటు గ్రామాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగేశ్వరరావు యాదవ్, ఎల్లనాగయ్య, బుగ్గన ప్రసన్నలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



గుడ్లు, బ్రెడ్లు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

డోన్: తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ఇన్నర్‌వీల్ క్లబ్ కార్యాలయంలో శుక్రవారం 25 మంది గర్భిణులకు కోడిగుడ్లు, పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు మద్దమ్మ, కార్యదర్శి శకుంతలారెడ్డి మాట్లాడుతూ.. సూర్యకుమారి ఆర్థిక సహాయంతో వీటిని అందజేశామని చెప్పారు. తల్లి పాల విశిష్టతను వివరించారు. సభ్యులు రాజా సుజాత, సుమిత్ర, శారద, శైలజారెడ్డి, శాలిని, సరళాదేవి, అనురాధ పాల్గొన్నారు.

సమాజ సేవతోనే ఆత్మ సంతృప్తి

డోన్ టౌన్: సమాజ సేవలో పాలుపంచుకుంటే ఆత్మ సంతృప్తి లభిస్తుందని పట్టణానికి చెందిన హైకోర్టు న్యాయవాది పి.మస్తాన్‌వలి అన్నారు. శుక్రవారం కర్నూలు ప్రభుత్వాస్పత్రిలోని క్యాన్సర్ వార్డులో రూ.20 వేలు విలువచేసే మందులను ఆయన అందజేశారు.

రోటరీ క్లబ్ సేవలు ఆదర్శం



సీహెచ్‌సీలో వైద్య సిబ్బందిని సత్కరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

బేతంచెర్ల: సమాజానికి రోటరీ క్లబ్ సభ్యులు అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని శేషారెడ్డి సీహెచ్‌సీ వైద్యులు సాగరిక, చరణ్ రాజు, వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం రోటరీ క్లబ్ సభ్యుడు ప్రేమ స్వరూప్ సహకారంతో పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీ వైద్య సిబ్బందిని సత్కరించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ ఇప్పటికే రోగుల కోసం అంబులెన్స్, వైద్య పరికరాలు అందజేసిందని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వీరారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, సభ్యులు సత్తార్, వీర భద్రారెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

బేతంచెర్ల: బాల్య వివాహాలు చేయడం చట్టారిత్యా నేరమని, మగ పిల్లలతో సమానంగా ఆడ పిల్లలను చదివించాలని డోన్ ఐసీడీఎస్ సీడీపీఓ శంషాద్ బేగం, ఎంపీడీఓ రవి ప్రసాద్, వైద్యురాలు సాగరిక అన్నారు. శుక్రవారం పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో బేటీ బచావో– బేటీ పఢావో, తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చదువుతోనే బాలికలకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ సోమశేఖర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తిప్పమ్మ, రాధమ్మ, ఈశ్వరమ్మ, శోబారాణి, పరమేశ్వరి, సుగుణమ్మ, శకుంతల పాల్గొన్నారు.

నీటి కష్టాలు

- జగనన్న కాలనీలో పనిచేయని బోర్లు
- పట్టించుకోని అధికారులు
- నీటి కోసం తిప్పలు



జగనన్న కాలనీలో పనిచేయని బోరు



నిరుపయోగంగా మారిన ట్యాంకు

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని జగనన్న కాలనీలో పది రోజుల నుంచి ప్రజలు నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. కాలనీలో ఏర్పాటు చేసిన రెండు బోర్లు చెడిపోవడంతో నీటి కోసం తిప్పలు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సార్బీసీ కాలనీలో 250 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయడంతోపాటు పక్కాగృహాలు కేటాయించారు. 150 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాగా 50 ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలిన గృహ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. 20 కుటుంబాలు కాలనీలో నివాసం ఉంటున్నాయి. కాలనీలో నీటి సరఫరాకు రెండు బోర్లు ఏర్పాటు చేసి రౌండ్ లెవల్ ట్యాంకులు నిర్మించి కొళాయిల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. ఉన్న రెండు బోర్లు చెడిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో కాలనీలో నివాసం ఉంటున్న ప్రజ లు నీటి కోసం అవస్థలు పడుతున్నారు. కాలనీలో ఉన్న బోర్ల ద్వారా ఉప్పునీరు వస్తుండడంతో ఆ నీటి ని ఇంటి అవసరాలకు వినియోగించుకుంటున్నారు. తాగునీటిని పట్టణంలోని మినరల్ వాటర్‌ప్లాంట్ ద్వారా తెచ్చుకుంటున్నారు. బోర్లు పనిచేయకపోవ డంతో ఇంటి అవసరాలకు కావాల్సిన నీరు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివిధ దశల్లో నిర్మితమవుతున్న ఇళ్ల నిర్మాణాలకు నీటి కొరత ఏర్పడింది. ఇళ్ల నిర్మాణాలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. బోర్ల మరమ్మతులు చేపట్టాల ని కాలనీ వాసులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కాలనీలో బోర్లు, కొళాయిలు ఏర్పాటు చేసి హౌసింగ్ శాఖకు అప్పగించారు. తాగునీటి సమస్య తలెత్తితే ఆ శాఖ ఆధ్వర్యంలో మరమ్మతు పనులు చేపట్టాల్సి ఉంది. హౌసింగ్ అధికారులు కాలనీని మేజర్ గ్రా మ పంచాయతీకి అప్పగించాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో సమస్య తలెత్తింది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని కాలనీ వాసులకు నీటి కష్టాలు తొలగించాలని కోరుతున్నారు.

పది రోజులుగా నీరు రావడం లేదు



జగనన్న కాలనీలో ఇంటి పట్టాతోపాటు పక్కాగృహం మంజూరు కావడంతో ఇంటి నిర్మాణం చేపట్టి ఈ ఏడాది జనవరి నుంచి కాలనీలో నివాసం ఉంటున్నాం. పది రోజుల నుంచి బోర్లు చెడిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. అధికారుల దృష్టికి తీసుకెళ్లగా సొంత ఖర్చులతో బోర్ల మరమ్మతులు చేయించుకోవాలని చెబుతున్నారు.

–మహబూబ్‌పీరా, కోవెలకుంట్ల

బోర్లకు మరమ్మతులు చేపట్టాలి



జగనన్న కాలనీలో ఉన్న రెండుబోర్లు చెడిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. తాగునీటితో పాటు అవసరాలకు నీరు అందుబాటులో లేక దాదాపు కిలోమీటర్ దూరంలో ఉన్న పట్టణానికి వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నాం. అధికారులు బోర్ల మరమ్మతులు చేపట్టి నీటి సమస్యను పరిష్కరించాలి.

–అమీర్‌బాషా, కోవెలకుంట్ల

పెద్దమ్మ తల్లికి బోనాల సమర్పణ



బోనాలను తీసుకెళ్తున్న భక్తులు

ప్యాపిలి: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని స్థానిక పెద్దమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను తలపై ఉంచుకుని మేళతాళాల నడుమ ఆలయానికి చేరుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సామూహికంగా బోనాలను సమర్పించారు. ఏటా శ్రావణ మాసంలో అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామపెద్దలు తెలిపారు. ఇలా చేయడం వల్ల సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని భక్తుల విశ్వాసం.

కనుల పండువగా ఉమామహేశ్వరుని కల్యాణం



స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

బనగానపల్లె రూరల్: మాస శివరాత్రిని పురస్కరించుకుని యాగంటిలోని ఉమామహేశ్వరస్వామి వారి కల్యాణాన్ని శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ చంద్రశేఖరరెడ్డి, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో ఏకశిలా రూపంలో కొలువైన ఉమామహేశ్వరస్వామికి అభిషేకాలు, అర్చనలు, అలంకరణ, నైవేద్య సమర్పణ చేశారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను వధూవరులుగా ముస్తాబు చేసి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణాన్ని జరిపించారు. భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి తన్మయత్వం చెందారు.

రమణీయం.. చౌడేశ్వరిదేవి పల్లకోత్సవం



పల్లకీపై విహరిస్తున్న అమ్మవారు

బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం పల్లకీ సేవను వేడుకగా నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన, ప్రత్యేక అలంకరణ, నేవైద్యం సమర్పించి మహా మంగళహారతులు ఇచ్చారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుదీర్చి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న మహిళా భక్తులు

డోన్: ఆషాడ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని పాతబస్టాండ్‌లోని కనకదుర్గమ్మకు విశేష పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి నెయ్యి దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు

లారీ యజమానులు మొండి వైఖరిని వీడాలి



సమ్మె చేస్తున్న లారీ డ్రైవర్లు

ప్యాపిలి: లారీ డ్రైవర్లపై యజమానులు మొండి వైఖరిని విడనాడాలని డోన్ మోటర్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శివరాం అన్నారు. మండల పరిధిలోని బావిపల్లి గ్రామంలో లారీ డ్రైవర్లు చేస్తున్న సమ్మెలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంవీయూ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. నిత్యావసర సరుకులు, ఇతర అన్ని ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో డ్రైవర్ల జీతభత్యాలను పెంచాలని కోరారు. కొందరు యజమానుల నిర్వాకంతో లారీ డ్రైవర్లు, క్లీనర్లతో పాటు చిన్నాచితకా యజమానులు కూడా రోడ్డున పడే పరిస్థితి నెలకొందన్నారు. డ్రైవర్ల దీనస్థితిని దృష్టిలో ఉంచుకుని యజమానులు ఇప్పటికైనా తమ వైఖరిని మార్చుకుని జీతభత్యాలు పెంచాలన్నారు. యూనియన్ నాయకులు తిమ్మప్ప, నాగేశ్, మధు, దుబ్బన్న, చంద్రశేఖర్ రెడ్డి, కిట్టు, రామచంద్రుడు, తిరుపాలు, ఆదం, గోవిందు, మధు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డ ఆరోగ్యానికి రక్ష





సంజామలలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు,కొలిమిగుండ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సంజామల: బిడ్డకు తల్లి పాలు తాగించడం వల్ల రోగ నిరోధక శక్తి లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంత అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సంజామలలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ.. శిశువుకు ఆరు నెలల పాటు తల్లిపాలే పట్టా లని సూచించారు. పాలలో ఉండే పోషకాలు బిడ్డ ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తాయన్నారు. ముర్రుపాలలో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో పేరుసోముల క్లస్టర్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌సుగుణ, రసూల్‌బీ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని పెట్నికోట అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో తల్లిపాల వారోత్సవాలపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. తల్లిపాలే బిడ్డకు శ్రీరామ రక్ష అని ఏఎన్‌ఎం రామలక్ష్మి సూచించారు. ప్రసవం జరిగిన గంటలోపు బిడ్డకు ముర్రుపాలు తాగించాలని చెప్పారు. తల్లి పాలను తాగించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. వ్యాధులు దరి చేరకపోవడం, బిడ్డ మానసిక ఎదుగుదలకు తల్లి పాలు దోహదపడుతాయని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త శ్రీలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ రేష్మ, ఆయా సుబ్బమ్మ పాల్గొన్నారు.

‘మాదిగల ఆకాంక్ష నెరవేరింది’






మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు, డోన్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తూ..

సంజామల: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో మాదిగల ఆకాంక్ష నెరవేరిందని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు మిద్దె వెంకట రాముడు అన్నారు. శుక్రవారం సంజామలలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చింతమాను కంబగిరితో కలిసి మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సుదీర్ఘ పోరాటానికి ఫలితం దక్కిందని హర్షం వ్యక్తం చేశారు. సంఘం నాయకులు దేవరాజు, ఓబయ్య, రాంపుల్లయ్య,సంజీవరాయుడు, బాలపక్కీర పాల్గొన్నారు.

డోన్ టౌన్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని ఎమ్మార్పీఎస్ మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కోకన్వీనర్ శ్రీరాములు, నంద్యాల జిల్లా కన్వీనర్ రాజు, కోకన్వీనర్ జీవన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాలాభిషేకం చేసి మిఠాయిలు పంచిపెట్టారు. వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో పెట్టి చట్టబద్ధత కల్పించాలని కోరారు. ఎమ్మార్పీఎస్ నాయకులు రాజా, సురేంద్ర, వెంకటేష్, నారాయణ, శేఖర్ పాల్గొన్నారు.

లలితా సుందరేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు



శాకంబరి అలంకరణలో అమ్మవారు

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని లలితా సుందరేశ్వరదేవి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అవుకు పట్టణానికి చెందిన వ్యాపారి రమేష్ వివిధ రకాల కూరగాయలు ఇవ్వడంతో వేదపండితులు ఆలూరి నరసింహప్రసాద్, రాఘవేంద్రప్రసాద్ అమ్మవారిని శాకంబరి అలంకరణ చేసి విశేష పూజలు చేశారు.

పంటను నాశనం చేసిన వారిని శిక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

డోన్ టౌన్: గడ్డి తొలగింపు కోసం పిచికారీ చేసే మందుతో 4 ఎకరాల్లో సద్ద, కంది పంటను నాశనం చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఇందిరాంపల్లె గ్రామానికి చెందిన కిల్లే సుంకన్న, కిల్లే రామేశ్వర్‌కు చెందిన పొలంలో సద్ద, కంది పంటను గుర్తు తెలియని వ్యక్తులు జూలై 28వ తేదీ రాత్రి గడ్డి మందు పిచికారీ చేసి నాశనం చేశారని ఆరోపించారు. బాధ్యులను శిక్షించాలని కోరారు. సీపీఐ నాయకులు సుంకయ్య, రాధాకృష్ణ, ప్రభాకర్, నారాయణ, వరదరాజు ఉన్నారు.

మినీ గోకులాలను సద్వినియోగం చేసుకోవాలి



పశు వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఏడీ మోహన్ రావు

సంజామల: పాడి రైతుల మినీ గోకులాలను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ మోహన్ రావు అన్నారు. సంజామల పశుపరియా ఆస్పత్రిలో కొలిమిగుండ్ల, సంజామల పశువైద్యులు, సిబ్బందితో సమీక్షించారు. పశు వైద్యులు పాడి రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మినీ గోకులాలు అవసరమైన వారు సమీపంలోని పశు వైద్యులను సంప్రదించాలని సూచించారు. పశువైద్యులు రమేష్‌బాబు, రఘుబాల క్రిష్ణ, పద్మావతి, కస్తూరి పాల్గొన్నారు.

సుదీర్ఘ పోరాటానికి దక్కిన ఫలితం

బేతంచెర్ల/డోన్: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మాదిగల సుదీర్ఘ పోరాటానికి దక్కిన ఫలితం అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి తాలుక రాజయ్య అన్నారు. శుక్రవారం ఆర్.బుక్కాపురం గ్రామంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమితీ నాయకులు వెంకటేష్, మద్దయ్య, సాయిరాజ్, బజార్ పాల్గొన్నారు. సుప్రీకోర్టు తీర్పు మాదిగల్లో సంతోషం నింపిందని బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాది శీలం భాస్కర్‌నాయుడు అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బనగానపల్లె రూరల్:స్థానిక సబ్ స్టేషన్ పరిధి లో 11 కేవీ యాగంటిపల్లె ఫీడర్ మరమ్మతు పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. పాతపాడు గ్రామ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ ఉదయం 4 గంటల నుంచి 8 గంటల వరకు, మళ్లీ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5గంటలవరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు.

ప్యాపిలి: పెద్దపొదిళ్ల, చిన్నపొదిళ్ల గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వినయ్ తెలిపారు. చిన్నపొదిళ్ల ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు.

డోన్ టౌన్: ఇండస్ట్రియల్ సబ్‌స్టేషన్ పరిధిలోని గోసానిపల్లె, టౌన్ ఫీడర్ల పరిధిలో మరమ్మతు ల పనుల కారణంగా శని, ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరె డ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ల నుంచి కొచ్చెర్వు గ్రామం వరకు ఉండే పొ లాలు,ఫ్యాక్టరీలకు ఉదయం 9 గంటల నుంచి మ ధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. రైతులకు తెల్లవారుజామున 3 నుంచి 9 గంటల వరకు అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇ స్తామని వెల్లడించారు.

108 చీరల అలంకరణలో వాసవీమాత



బేతంచెర్లలో సారెతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



108 చీరలతో అలంకరించిన వాసవీమాత

బనగానపల్లె: పట్టణంలోని కొండపేటలో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరిదేవికి సారె మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహిళాలు వివిధ రకాల పిండి వంటలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి పూజలు చేశారు. అమ్మవారిని 108 చీరలతో ప్రత్యేకంగా అలంకరించారు.

బేతంచెర్ల: ఆషాడ మాసం చివరి శుక్రవారం సందర్భంగా పట్టణంలోని అమ్మవారిశాలలో వెలసిన వాసవీ మాతకు ఆర్యవైశ్య సంఘం, వాసవీ మహిళా మండలి మహిళలు చీర, సారె సమర్పించారు. మహిళలు ఊరేగింపుగా మంగళవాయిద్యాల నడుమ ఆలయానికి చేరుకుని వాసవీమాత ఉత్సవమూర్తిని కొలువుంచారు. చీర, సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆర్యవైశ్యులు గుండా గోపాలు, జనార్ధన్, మద్దిలేటిస్వామి, మాణిక్యం, రాజేంద్ర, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు

- మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి
- కాటసాని నాగార్జునరెడ్డి ఘాట్‌లో నివాళి



నాగార్జునరెడ్డి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న కాటసాని రామిరెడ్డి, జయమ్మ దంపతులు

బనగానపల్లె రూరల్: కాటసాని నాగార్జునరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పెద్ద కుమారుడు కాటసాని నాగార్జునరెడ్డి జయంతిని నిర్వహించారు. అవుకు రోడ్డులోని షిరిడీ సాయిబాబా ఆలయ సమీపంలో ఉన్న నాగార్జునరెడ్డి ఘాట్ వద్ద సతీమణి కాటసాని జయమ్మతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటికే క్రీడా పోటీలు, విద్య, వైద్య రంగంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అక్కడే కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. వైఎస్సార్‌సీపీ అవుకు కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు శంకర్‌రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, సురేష్, రమణ, అంబటి రవికుమార్‌రెడ్డి, నారాయణ, మూర్తుజా, మద్దయ్య పాల్గొన్నారు.

కలచట్లలో పట్టపగలే చోరీ



దుండగులు తెరిచిన బీరువా

ప్యాపిలి: మండల పరిధిలోని కలచట్ల గ్రామంలో శుక్రవారం పట్టపగలే చోరీ జరిగింది. గ్రామానికి చెందిన బాలచంద్రశేఖర్ తన కుటుంబ సభ్యులతో కలసి పొలానికి వెళ్లాడు. సాయంత్రం పొలం నుంచి వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించి లోపలికి వెళ్లి పరిశీలించాడు. బీరువాలో ఉంచిన 4 తులాలు బంగారు, 12 తులాలు వెండి నగలతో పాటు రూ. 5 వేలు చోరీ అయినట్లు గుర్తించాడు. బాధితుడు ప్యాపిలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి





పాతపేట హైస్కూల్‌లో వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు,నెహ్రూనగర్ స్కూల్‌లో..

డోన్ టౌన్: జాతీయ పతాకం రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పింగళి వెంకయ్య మహాత్మగాంధీ అడుగు జాడల్లో నడుస్తూ 1921లో విజయవాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ సమావేశంలో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, వెంకటరమణ, వెంకటలక్ష్మీ, రాధ, శ్రీనివాసులు, అల్లీపీరా పాల్గొన్నారు. అలాగే నెహ్రూనగర్ ఎంపీపీ స్కూల్‌లో హెచ్‌ఎం శ్రీనివాసులు, సామాజిక కార్యకర్త మహ్మద్ రఫీ ఆధ్వర్యంలో పింగళి వెంకయ్యతో పాటు టెలిఫోన్ ఆవిష్కర్త అలెగ్జాండర్ గ్రహంబెల్ వర్ధంతిని పురస్కరించుకుని వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. ఉపాధ్యాయులు అబ్దుల్‌రహీం, లక్ష్మమ్మ, కౌన్సిలర్ ఉమా మహేశ్వరి పాల్గొన్నారు.